రూ.2 లక్షల కోట్లతో సంక్షేమం

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని పేదలందరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు రూ.2 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేసిందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 10, 11, 14, 15 వార్డుల్లో శనివారం ఎమ్మెల్యే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ అందుతున్నాయని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా, కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

చిన్నారి సమస్యను విని..

స్థానిక 15వ వార్డులో ఎమ్మెల్యే పర్యటిస్తుండగా రోహిత అనే చిన్నారి తాను స్కూల్‌కు వెళ్లాలంటే బస్సు ఎక్కాలని, తమ ఇంటి వద్ద రోడ్డు లేకపోవడంతో బస్సు డ్రైవర్ రానంటున్నారని, ఈ కారణంగా కొంతదూరం నడచి వెళ్లి స్కూల్ బస్సు ఎక్కుతున్నానని తెలిపింది. స్పందించిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సచివాలయ నిధులలో వెంటనే ఈ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మించాలని అధికారులను ఆదేశించారు.

విలేకరి కుటుంబానికి అండగా..

ప్రజాశక్తి పత్రిక బుచ్చిరెడ్డిపాళెం మండల విలేకరిగా విధులు నిర్వహిస్తూ మృతిచెందిన భాగ్యరాజ్ కుటుంబానికి ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అండగా నిలిచారు. నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం విలేకరి భాగ్యరాజ్ భార్య శిరీషకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లారెడ్డి, అనంతమ్మ, చీర్ల ప్రసాద్, జయంతి, షకీలాబేగం, యానాదిరెడ్డి, శ్రీదేవి, ప్రత్యూష, సత్యనారాయణ, ప్రమీలమ్మ, నాయకులు సీతారామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ అల్లాభక్షు, గుంటూరు వెంకటేశ్వర్లు, విల్సన్, ప్రవల్లిక పాల్గొన్నారు.

కోడూరులో 'జగనన్న సురక్ష'



దరఖాస్తుదారుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు, నాయకులు

తోటపల్లిగూడూరు: చిన్నచిన్న సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని అర్హులైన లబ్ధిదారులకు సైతం పథకాల లబ్ధిని అందించేలా 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి కోడూరు దిలీప్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కోడూరు బిట్–2 గ్రామ సచివాలయంలో శనివారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం పరిధిలో 2,012 మంది వివిధ రకాల సేవలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకోగా అధికారులు వాటిని అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ వసుమతి, ఎంపీడీఓ హేమలత, డిప్యూటీ తహసీల్దార్ శివయ్య, ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగాల శ్రీనివాసులురెడ్డి, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

మనుబోలు: రాష్ట్ర ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందిస్తోందని ఎంపీపీ వజ్రమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు అనితమ్మ తెలిపారు. మండలంలోని వెంకన్నపాళెం సచివాలయంలో శనివారం 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించి దరఖాస్తుదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల సిఫార్సులు అవసరమయ్యేవని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హతే ప్రామాణికంగా పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఎక్కడైనా సాంకేతిక కారణాలతో అర్హులకు పథకాలు అందకుంటే, వారికి కూడా పథకాలు అందేలా అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలను 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంచలమ్మ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శివకృష్ణయ్య, నాయకులు వల్లూరు హర్షవర్ధన్‌రెడ్డి, ఏడెం మల్లికార్జునరెడ్డి, అడపాల శివకుమార్‌రెడ్డి, హరగోపాల్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సాయిమోహన్ రెడ్డి, భాస్కర్‌గౌడ్, మనోహర్‌రెడ్డి, జయశేఖర్‌రెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పచ్చి బియ్యానికి అనుమతులు ఇవ్వాలి





ఎంపీలు వేమిరెడ్డి, ఆదాలకు వినతిపత్రాలు అందజేస్తున్న దృశ్యం

కోవూరు: రైతులకు వెన్నెముకగా నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వం వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదని, పచ్చి బియ్యం ఎగుమతికి అనుమతులు ఇవ్వాలని డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. అందుకు సంబంధించి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అంశాన్ని కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అలాగే పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాలని కోరారు. ఆయన వెంట పడుగుపాడు సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఎంఏఏబీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ ప్రసాద్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కసుమూరులో భక్తుల కోలాహలం



దర్గాలో భక్తుల సందడి

వెంకటాచలం: మండలంలోని కసుమూరు మస్తాన్‌వలి దర్గా ప్రాంగణం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. నెల్లూరులోని బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండగకు వచ్చిన భక్తులు కసుమూరు మస్తాన్‌వలి దర్గాను దర్శించుకునేందుకు వస్తుంటారు. శనివారం రొట్టెల పండగ ప్రారంభం కావడంతో సాయంత్రానికి కసుమూరులో భక్తుల సందడి మొదలైంది. దర్గాను దర్శించుకునే భక్తులను దృష్టిలో ఉంచుకుని కసుమూరులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ సమస్య, క్యూలైన్ల వద్ద పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అలాగే తాగునీరు, పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. రొట్టెల పండగ ముగిసేవరకు కసుమూరు దర్గా వద్ద భక్తుల రద్దీ కొనసాగనుంది.

ఎమ్మెల్యేను కలిసిన ఈఈ

కోవూరు: కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాసులురెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో ప్రసన్నకుమార్‌రెడ్డిని కలిసి పలు అంశాలపై చర్చించారు. ఆయన వెంట డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, కోవూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాష్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: బైక్ అదుపుతప్పి పడిపోయి వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కనుపూరు వద్ద శనివారం చోటుచేసుకుంది. నెల్లూరు నగరంలోని పొదలకూరురోడ్డు ప్రాంతానికి చెందిన షేక్.మహబూబ్‌బాషా పనినిమిత్తం బైక్‌పై కసుమూరుకు వెళ్లాడు. తిరిగి నెల్లూరుకు వెళుతుండగా కనుపూరు సమీపంలో గేదెలు అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో మహబూబ్‌బాషాకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లోన్‌యాప్ వేధింపులపై ఫిర్యాదు

కోవూరు: సంగం మండలానికి చెందిన ఓ యువతి కోవూరులోని ఓ కళాశాలలో విద్యనభ్యసిస్తోంది. ఆ విద్యార్థిని లోన్ యాప్ ద్వారా రూ.3,500 అప్పు తీసుకుంది. ఆ అప్పు తిరిగి చెల్లించినప్పటికీ లోన్‌యాప్‌కు చెందిన వ్యక్తులు ఆన్‌లైన్ ద్వారా ఆమెను వేధింపులకు గురిచేశారు. మనస్తాపం చెందిన ఆ విద్యార్థిని శనివారం ఎస్‌ఓఎస్ యాప్ ద్వారా సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కోవూరు ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు 5 నిమిషాల వ్యవధిలోనే విద్యార్థిని వద్దకు చేరుకుని భరోసా ఇచ్చారు.

రైల్వేస్టేషన్లలో పటిష్ట బందోబస్తు

నెల్లూరు(క్రైమ్): రొట్టెల పండగకు జిల్లాకు తరలివచ్చే భక్తుల భద్రత దృష్ట్యా రైల్వే స్టేషన్‌లలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నెల్లూరు రైల్వే డీఎస్పీ పీ మల్లికార్జునరావు తెలిపారు. నెల్లూరు రైల్వేపోలీసుస్టేషన్‌లో నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన రైల్వే పోలీసులకు బందోబస్తుపై శనివారం ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతకల్ రైల్వే ఎస్పీ కే చౌడేశ్వరి ఆదేశాల మేరకు 60మంది రైల్వే సిబ్బందితో నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్, సౌత్, వేదాయపాళెం, వెంకటాచలం రైల్వేస్టేషన్‌లలో బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో రెండో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. మఫ్టీలో క్రైమ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. సంతపేట, నవాబుపేట పోలీసు లు, ఆర్పీఎఫ్ సహకారంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ఆత్మకూరు బస్టాండు నక్కలోళ్ల సెంటర్, రంగనాయకులపేటగేటు, వేదాయపాళెం, తదితర ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా గస్తీని ఏర్పాటు చేశామన్నారు. రైల్వేస్టేషన్‌లలో రైళ్లు నిదానంగా వెళ్లేలా చర్యలు తీసుకున్నామన్నారు. నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల్లో భాగంగా తీసిన భారీ గుంతల చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

రొట్టెల పండగ సౌకర్యాల పర్యవేక్షణ

నెల్లూరు(బారకాసు): నగరంలోని బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండగ తొలిరోజు భక్తులకు కల్పించిన సౌకర్యాలను కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్, అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరితో కలిసి జేసీ కూర్మనాథ్ శనివారం పర్యవేక్షించారు. ఐదు రోజుల పాటు జరుగనున్న రొట్టెల పండగకు పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు దర్గా ప్రాంగణం, రొట్టెలు మార్చుకునే స్వర్ణాల చెరువు ప్రాంతంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వెంకటస్వామి

పొదలకూరు: ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాయుడు వెంకటస్వామి పిలుపునిచ్చారు. పొదలకూరులో శనివారం తాలుకా యూనిట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ ఎన్జీఓల సమస్యలు తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. పొదలకూరు తాలూకా యూనిట్ నుంచి అధిక సంఖ్యలో మహాసభలకు హాజరుకావాలన్నారు. సమావేశంలో జిల్లా కోశాధికారి బి.వెంకటేశ్వర్లు, అసోసియేట్ ప్రెసిడెంట్ ఆంజనేయవర్మ, కార్యనిర్వాహక కార్యదర్శి జి.రామకృష్ణ, తాలూకా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విష్ణాలయంలో ఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి

మనుబోలు: ఏకాదశిని పురస్కరించుకుని మనుబోలులోని విష్ణాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు హనుమాచార్యులు శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు బొమ్మిరెడ్డి రామసుబ్బారెడ్డి–శిరీష దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెనుగొండ సుధాకర్, పొట్టి సుబ్బారావు, కసుమూరు రామసుబ్బారెడ్డి, చల్లా శ్రీధర్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నూతన చర్చి ప్రారంభం

• పాల్గొన్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



చర్చిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: మండలంలోని గౌతమ్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన తెలుగు బాప్టిస్టు చర్చిని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గౌతమ్‌నగర్ వాసులు సమైక్యంగా చర్చి నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, సర్పంచ్, సంఘ కార్యదర్శి నాగిరెడ్డి సునీల్‌కుమార్, సంఘ వైస్ చైర్మన్ గోళ్ల విజయకుమార్, జాయింట్ సెక్రటరీ గంగపట్నం విజయభాస్కర్, ట్రెజరర్ నాగిరెడ్డి సాల్మన్ పాల్గొన్నారు.

దారి సమస్యకు పరిష్కారం

• రూ.10 లక్షలతో కల్వర్టు నిర్మాణానికి మంత్రి కాకాణి చర్యలు



నిర్మాణంలో ఉన్న కల్వర్టు

పొదలకూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 2006లో పొదలకూరుకు చెందిన 13 మంది గిరిజనులకు పొదలకూరుకు సమీపంలో సర్వేనంబర్ 707లో ఒక్కొక్కరికి 1.50 ఎకరాల చొప్పున అసైన్డ్ భూములు పంపిణీ చేశారు. ఆ భూముల్లో వారు నిమ్మచెట్లు సాగు చేసుకుంటున్నారు. అయితే గిరిజనులు ఆ భూముల్లోకి వెళ్లేందుకు సరైన దారి లేక ఇబ్బందులు పడుతుండేవారు. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు కూడా వీరి సమస్యను పరిష్కరించలేదు. ఇటీవల 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పొదలకూరు పంచాయతీ సచివాలయం బిట్–4 పరిధిలో పర్యటించగా గిరిజనులు వారి దారి సమస్యలను మంత్రికి వివరించారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులను పిలిపించి గిరిజనుల పొలాలకు దారితోపాటు మార్గమధ్యంలో వాగుపై కల్వర్టు నిర్మించాలని ఆదేశించారు. రూ.10 లక్షల వ్యయంతో కల్వర్టు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. దీంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

శాశ్వత పరిష్కారం లభించింది



మా తోటల్లోకి దారి ఉన్నా వాగు అడ్డంకిగా మారడంతో చాలా ఏళ్లుగా ఇబ్బందులు పడేవాళ్లం. మంత్రి గోవర్ధన్‌రెడ్డి చొరవతో శాశ్వత పరిష్కారం లభించింది. కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– జి.పెంచలయ్య, గిరిజన రైతు, లింగంపల్లితోపు

ఎన్నో ఏళ్ల సమస్య తీరింది



ఎన్నో ఏళ్ల దారి సమస్య మంత్రి కాకాణి చొరవతో పరిష్కారమైంది. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో మా గిరిజనుల సమస్యను మంత్రికి చెప్పడంతో ఆయన అధికారులతో మాట్లాడి కల్వర్టు మంజూరు చేశారు. మంత్రికి ధన్యవాదాలు.

– మల్లిక చిట్టెమ్మ, సర్పంచ్, పొదలకూరు.

స్కూలు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

• బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

మనుబోలు: నిర్లక్ష్యంగా బస్సు నడిపి రెండేళ్ల చిన్నారి మరణానికి కారణమైన బస్సు డ్రైవర్‌ను కఠినంగా శిక్షించడమే కాకుండా సంబంధిత స్కూలు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం మండలంలోని మడనూరు గ్రామంలో రెండేళ్ల సాత్విక్ అనే చిన్నారిని స్కూల్ బస్సు ఢీకొనడంతో మరణించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సాత్విక్ తల్లిదండ్రులను వడ్డెర సంఘం నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సు డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నిర్లక్ష్యంగా బస్సు నడపడం వల్లే చిన్నారి బలైపోయినట్లు తెలిపారు. క్లీనర్ లేకుండా కేవలం డ్రైవర్‌తోనే బస్సు నిర్వహిస్తున్న స్కూలు యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని, ప్రస్తుతం అదే స్కూల్లో చదువుతున్న బాధిత కుటుంబానికి చెందిన పిల్లలిద్దరికీ ఉచితంగా విద్యనందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట చేతి వృత్తుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు భాస్కర్ తదితరులు ఉన్నారు.

త్యాగాలకు ప్రతీక మొహర్రం



మనుబోలు: తాజియా చేస్తున్న ముస్లింలు



పొదలకూరు: భక్తులు ఏర్పాటు చేసిన పీర్లు



బుచ్చిరెడ్డిపాళెం: నిప్పులపై నడుస్తున్న దృశ్యం

మనుబోలు: మొహర్రం పర్వదినం అమర వీరుల త్యాగాలకు ప్రతీకగా అంజుమన్ హుసైన్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మండలంలోని కాగితాలపూరు గ్రామంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న మొహర్రం ముగింపు కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని హజ్రత్ ఇమాం, హజ్రత్ అబ్బాస్‌ల పీర్లను ముస్తాబు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. విషాద చిహ్నంగా దర్గాలను నలుపురంగు కాగితాలతో అలంకరించారు. భారీ సంఖ్యలో ముస్లింలు దర్గా వద్ద చేసిన తాజియా(రెండు వేళ్ల మధ్య బ్లేడు ఉంచుకుని ఛాతిపై రక్తం వచ్చేలా కొట్టుకోవడం) చూపరులకు కంటతడి పెట్టించింది. కులమతాలకు అతీతంగా గ్రామస్తులు పీర్ల ఉత్సవాన్ని తిలకించడం విశేషం. సర్పంచ్ ఏడుకొండలు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రవి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం పండగ

పొదలకూరు: మండలంలోని పార్లపల్లిలో మొహర్రం పండగను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. గ్రామంలో పీర్లను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. పీర్లను గ్రామంలో నిలిపి అనంతరం ఊరేగింపు నిర్వహించారు.

అగ్నిగుండం

బుచ్చిరెడ్డిపాళెం: పీర్ల పండగ సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెం ఖాజానగర్‌లో శనివారం వేకువజామున నిర్వహించిన అగ్నిగుండంలో నడిచే కార్యక్రమంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లింలు, మతపెద్దలు పాల్గొన్నారు.

కత్తితో దాడి.. ఇద్దరికి గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం: పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన మండలంలోని కలయకాగోల్లు పంచాయతీ నక్కలదిబ్బ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు నక్కలదిబ్బకు చెందిన కేతిరెడ్డి రోహిత్‌కు అదే గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్యకు గతంలో చిన్నపాటి గొడవ జరిగింది. ఈ క్రమంలో శనివారం వేకువజామున గ్రామంలో జరిగిన పీర్ల పండగలో రోహిత్ పాల్గొనగా అక్కడే ఉన్న వెంకటసుబ్బయ్య రోహిత్‌ను చూసి పాత గొడవ గుర్తుకురావడంతో వెంటనే తనకు వరుసకు సోదరుడైన రాజేష్, మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి రోహిత్‌తో గొడవ పడ్డారు. అనంతరం వారు తెచ్చుకున్న కత్తితో రోహిత్ ముక్కుపై దాడి చేసి గాయపరిచారు. ఈ విషయాన్ని గమనించిన గ్రామానికి చెందిన దాసయ్య ఈ గొడవను సద్దుమణిగేలా చేయాలని ప్రయత్నించే క్రమంలో వెంకటసుబ్బయ్య, రాజేష్‌లు కలిసి దాసయ్య కడుపులో కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డారు. అనంతరం నిందితులు నలుగురు గ్రామం నుంచి పరారు కాగా, గాయపడిన రోహిత్, దాసయ్యలను చికిత్సనిమిత్తం నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేశామని ఎస్సై వీరప్రతాప్ తెలిపారు.

క్లుప్తంగా

ఎంపీ వేమిరెడ్డిని కలిసిన ఆక్వా రైతులు



ఇందుకూరుపేట: మండలంలోని ఆక్వారైతులు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. రైతులకు సంబంధించిన పలు అంశాలను ఎంపీ వేమిరెడ్డితో చర్చించారు. కార్యక్రమంలో షేక్ షబ్బీర్, వేణుంబాక మహీధర్‌రెడ్డి, లేబూరు మహేష్‌రెడ్డి, దండిగుంట ఫణీంద్రనాయుడు, మారుబోయిన సంతోష్‌గౌడ్, గంగపట్నం, కుడితిపాళెం సర్పంచ్‌లు నిరంజన్‌నాథ్, నాయుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మైపాడు బీచ్‌కు భక్తుల తాకిడి



మైపాడు బీచ్‌లో సందడి చేస్తున్న సందర్శకులు

ఇందుకూరుపేట: ప్రముఖ పర్యాటక కేంద్రం మైపాడు బీచ్‌కు భక్తుల తాకిడి మొదలైంది. నెల్లూరులోని బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండగకు వచ్చిన భక్తులు మైపాడు బీచ్ సందర్శనకు వస్తుండడంతో సందడి నెలకొంది. శనివారం బీచ్‌కు వచ్చిన సందర్శకులు తీరంలో సేదతీరారు. స్నేహితులు, కుటుంబసభ్యులతో సంతోషంగా గడిపారు.

ఘనంగా భాషా వారోత్సవాలు



ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థి

ముత్తుకూరు: ముత్తుకూరుకు సమీపంలోని గోపాలపురంలో ఉన్న అదానీ వరల్డ్ స్కూల్‌లో వారం రోజులుగా నిర్వహిస్తున్న భాషా వారోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన వ్యాసరచన, నాటికలు, కథల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రిన్సిపల్ సత్యనారాయణ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో విద్యార్థులు ప్రావీణ్యం పొందేందుకు తాము నిరంతరం కృషి చేస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పున్నూరులో వయోజనవిద్య



పలకలు అందజేసిన ట్రస్ట్ సభ్యులు

ఇందుకూరుపేట: యానాదుల హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని పున్నూరు గిరిజనకాలనీలో శనివారం వయోజనవిద్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. వయోజనులకు చదవడం, రాయడం నేర్పించారు. ఈ సందర్భంగా వారికి పలకలు, పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో పోట్లూరు శ్రీనివాసులు, సుబ్బారావు, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

బోగస్ సర్టిఫికెట్లను రద్దు చేయాలి



నినాదాలు చేస్తున్న ఎరుకుల సంఘం నాయకులు

కొడవలూరు: బోగస్ కుల ధ్రువీకరణ పత్రాలను వెంటనే రద్దు చేయాలని ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ డిమాండ్ చేశారు. మండలంలోని రామాపురంలో ఆ సంఘం సభ్యులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరులో బీసీ–ఏకు చెందిన పాముల కులస్తులకు ఎస్టీ ఎరుకుల అని సర్టిఫికెట్లు మంజూరు చేశారని, దీంతో రాజ్యాంగం ఇచ్చిన ఎస్టీ రిజర్వేషన్‌లకు భంగం కలుగుతోందని పేర్కొన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కట్ట రమణయ్య, అన్నం చిన్నయ్య, ఎ.నాగరాజ, కె.నవీన్, దాస సురేష్ పాల్గొన్నారు.